క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత తదితరులు

తుక్కుగూడ: పురపాలక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. శుక్రవారం పుర పరిధి 1వ వార్డు దేవేందర్‌నగర్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, మున్సిపల్ సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు హర్యానా గవర్నర్ రాక

బడంగ్‌పేట్: స్థానిక మౌంట్ కార్మెల్ గ్లోబల్ పాఠశాలలో సంస్కృతి ద కల్చరల్ ఫెస్టివల్ పేరిట ఈ నెల 21,22న నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొననున్నారని పాఠశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనతో పాటు ఎయిర్ కమాండర్ టీమ్ లీడర్(డీఆర్‌డీఓ) అలోక్ ఛాయన వీఎస్ఎం, చిత్రపరిశ్రమ ప్రముఖులు రానున్నారని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం పుర పరిధి జెన్నాయిగూడ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చల్లాను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి వివిధ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుక్కుగూడ, సర్దార్‌నగర్, బాసగూడతండాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రావిర్యాల, కళాజ్యోతి, విజయడైరీలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు, హార్డువేరు పార్క్‌లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోండి

పహాడీషరీఫ్: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కౌన్సిలర్ పందెం కొండల్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రాచీన అభయాంజనేయ స్వామి, భవానీశంకర, లక్ష్మీనరసింహా స్వామి ఆలయ షెడ్డు నిర్మాణానికి విరాళం అందజేసిన కరన్‌కోట్ నాగేకార్ అమ్రేష్‌ను శుక్రవారం కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్ప సన్నిధానం గురుస్వాములు రమేష్ గౌడ్, బి.నరేందర్, కె.ఎస్.ప్రమోద్, బాలరాజు గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ యాదవ్, అధ్యక్షుడు ప్రశాంత్, కోశాధికారి సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధి సరస్వతిగూడ, ముచ్చర్ల, తిమ్మాపూర్, ఆకులమైలారం, కందుకూరు, దెబ్బడగూడ గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, ఎస్.జగన్, శ్రీనివాస్, నర్సింహ, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధి కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధి హనుమాన్‌నగర్‌కాలనీ, భాగ్యనగర్‌కాలనీ పేస్–1, శ్రీరమణకాలనీ ఫేజ్–1లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరగా.. త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారని కార్పొరేటర్ వెల్లడించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం షా అహంకారానికి నిదర్శనం
- వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, కాంగ్రెస్ నాయకుల డిమాండ్



తుక్కుగూడ: నిరసన వ్యక్తంచేస్తున్న కేఎల్లార్ తదితరులు

తుక్కుగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు అందేలా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడిని అవమానించడం షా అహంకారానికి నిదర్శనని విమర్శించారు. ఆయన వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జానకీరామ్, నాయకులు జంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాగడాలతో ర్యాలీ

బడంగ్‌పేట్: అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఐయామ్ అంబేడ్కర్ పేరుతో ప్లకార్డులు చేతబూని, కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను షా ఉపసంహరించుకోవడంతో పాటు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దయాసాగర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, బాలాపూర్ మండల అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి ఉన్నారు.

కందుకూరులో..

కందుకూరు: కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేయగా.. సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేశారు.



బడంగ్‌పేట: కాగడాల ప్రదర్శనలో మేయర్ పారిజాత, యూత్ కాంగ్రెస్ నాయకులు



కందుకూరు: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, ధర్మసమాజ్ పార్టీ నాయకులు

ఇంకా చిన్నచూపేనా?

బడంగ్‌పేట్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వలన ఇప్పుడిప్పుడే దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి ఫలాలు పొందుతున్నారని బాలాపూర్ కార్పొరేటర్ మహేశ్వరి అన్నారు. ఇది చూసి ఓర్వలేని బీజేపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. బడుగులపై ఇంకా చిన్నచూపేనా అని ప్రశ్నించారు. మొన్న కేంద్ర మంత్రి అమిత్‌షా.. రాజ్యాంగాన్ని, రచించిన అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడారని, నిన్న అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై దాడులు చేశారని విమర్శించారు. స్పీకర్‌ను గౌరవించాలన్న జ్ఞానం కూడా ప్రతిపక్షాలకు లేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో మత రాజకీయం మంచిది కాదని హితవు పలికారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను షా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై దాడికి పాల్పడిన ప్రతిపక్ష నేతపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పెద్ద చెరువు వద్ద చదును చేసి వదిలేసిన మల్టీపర్పస్ క్రీడా ప్రాంగణం

నిర్వహణ లోపం.. అలంకార ప్రాయం

- బోసిపోతున్న క్రీడాప్రాంగణాలు
- 16 ప్రాంతాల్లో స్థలాల ఎంపిక.. రెండు చోట్ల పనులు
- మల్టీపర్పస్ మైదానం.. ప్రహరీతో సరి

మీర్‌పేట: గ్రామీణ ప్రాంత యువతను ఆటల్లో ప్రోత్సహించేందుకు గ్రామానికో క్రీడామైదానం అంటూ రెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అధికారులు జిల్లెలగూడ, మీర్‌పేట ప్రాంతాల్లో మొత్తం 16 చోట్ల మైదానాల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. తొలినాళ్లలో హడావుడి చేసినప్పటికీ.. ఆ తరువాత ప్రాంగణాల పనులు, నిర్వహణ గురించి, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా అవి అలంకార ప్రాయంగా మిగిలాయి.

రూ.2 కోట్లతో మల్టీపర్పస్

మీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఒకే చోట అన్ని రకాల ఆటలకు సంబంధించి మల్టీపర్పస్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. స్థలాన్ని చదును చేసి చుట్టూ ప్రహరి(ఇనుప కంచె), రెండు వైపులా గేటు అమర్చి ఏడాది పూర్తయినా.. ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు.

షెటిల్ కోర్టుతో..

16 చోట్ల స్థలాలు ఎంపిక చేసి, జిల్లెలగూడ రాఘవేంద్రకాలనీలో కేవలం షెటిల్ కోర్టు, పెద్ద చెరువు వద్ద ప్రహరి నిర్మించి అధికారులు చేతులు దులుపుకొన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్టీపర్పస్ ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్‌తో పాటు పలు రకాల క్రీడల కోసం ప్రత్యేకంగా కోర్టులను నిర్మిస్తామని చెప్పిన అధికారులు.. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్కటి ఏర్పాటు చేయలేక పోతున్నారని క్రీడాకారులు పేర్కొంటున్నారు. మీర్‌పేటతో పాటు పరిసర ప్రాంతాల యువతకు అందుబాటులో ఉండే పెద్ద చెరువు వద్ద క్రీడా ప్రాంగణంలో త్వరిత గతిన పనులు చేపట్టి, వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ చేశారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

తుక్కుగూడ: క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాల స్థాయి నుంచి విద్యార్థులను వారికి ఆసక్తి ఉన్న ఆటల్లో ప్రోత్సహించడానికి మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలంగాణ ఒలంపిక్ నాయకులు మల్లారెడ్డి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ రామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు భావన ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనరెడ్డి

అయ్యప్ప భక్తులకు అన్నదానం



అయ్యప్ప భక్తులను సన్మానిస్తున్న ఆసిఫ్

కందుకూరు: మండల పరిధి కొత్తూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులకు శుక్రవారం మహ్మద్ నగర్‌కు చెందిన ఆసిఫ్‌జానీ అన్నప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటారు. అనంతరం స్వాములను శాలువాలతో సన్మానించి ఆశీర్వాదం పొందాడు. కార్యక్రమంలో గురుస్వాములు ఎ.కుమార్, ఎం.రవీందర్, ప్రభాకర్, చెన్నకేశ్వర్, జ్ఞానే శ్వర్, బాబుగౌడ్, కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు దోహదపడతాయని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ అన్నారు. ఆర్‌కేపురం భాష్యం పాఠశాల విద్యార్థులకు మూడు రోజులుగా క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి నాగరాజుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నర్సింహ ఎన్నిక

యాచారం: సీపీఎం మండల కార్యదర్శిగా నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన ఆలంపల్లి నర్సింహ వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ 8వ మండల మహాసభలో చేపట్టిన ఎన్నికకు మండల కార్యదర్శిగా 24 మంది పోటీ పడ్డారు. పార్టీ అధినాయకత్వం తప్పని పరిస్థితిలో రాత్రి ఓటింగ్ నిర్వహించగా.. మండల పరిధి గ్రామాల నుంచి ఓటింగ్ అర్హత కలిగిన వంద మంది డెలిగేట్స్ పాల్గొన్నారు. వారిలో అత్యధికులు నర్సింహకే మద్దతు పలికారు. దీంతో ఆయన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా నేతలు యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, సామెల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పడిపూజ

యాచారం: అయ్యప్ప నామస్మరణతో శుక్రవారం మండల కేంద్రం మార్మోగింది. ధర్మశాస్త్ర సేవా సమితి సన్నిధానంలోని అయ్యప్ప మాలధారులు ఇరుముడి పడి పూజ నిర్వహించారు. గురుస్వామి చందర్‌నాయర్ పర్యవేక్షణలో నారాయణశెట్టి, పురుషోత్తం, బాషల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టగా.. మాలధారులతో పాటు అనేక మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తుల భక్తిగీతాలు అలరించాయి. గురుస్వామి ఆధ్వర్యంలో సన్నిధానం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు అయ్యప్పదీక్షా పరులతో పాటు వారి కుటుంబ సభ్యులు భారీ ర్యాలీ తీశారు. అనంతరం భక్తులకు బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాష అన్నదానం చేశారు.



గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి పూజ చేస్తున్న దీక్షాపరులు

గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు



గవర్నర్ జిష్ణుదేవ్‌తో చిన్నారులు, క్లబ్ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి బాటసింగారం జ్యోతిరావు పూలే బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఇంటర్ సెకండియర్ విద్యార్థి శశికుమార్ గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అంతరిక్ష పరిశోధనలపై ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్.. పలువురు విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. వీరిని శ్రీహరి కోటకు తీసుకెళ్లనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.